క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

నర్మెట: స్థానిక మోడల్ స్కూల్‌లో కెమిస్ట్రీ, కామర్స్ సబ్జెక్టులు బోధించుటకు తాత్కాలిక పద్ధతిలో ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.శరత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీతో పాటు, బీఈడీ పట్టాకలిగిన అభ్యర్థులు ఈనెల 12వ తేదీలోగా నేరుగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఇందుకుగాను నెలసరి గౌరవవేతనం రూ.18,200 చెల్లించబడుతుందని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు 96765 98411 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి..

స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్: స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్ మండలాల్లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్స్ జి.కాళహస్తి, డాక్టర్ సమత బుధవారం వేర్వేరుగా ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 15వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫీజు రూ.100 అని వారు తెలిపారు.

రాష్ట్ర సభ్యుడిగా కేడీఆర్



దేవరుప్పుల: తెలంగాణ రాష్ట్ర విజయ డెయిరీ పరిరక్షణ సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మండల కేంద్రానికి చెందిన కాసారపు ధర్మారెడ్డి(కేడీఆర్) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాడిపరిశ్రమ అభివృద్ధికి ఇచ్చిన హామీల అమలుతోపాటు హక్కుల సాధనకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

బియ్యం వితరణ

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్‌లో గడ్డల సత్తమ్మ, భిక్షపతి దంపతుల కూతురు ప్రియాంక వివాహానికి బీజేపీ మండల అధ్యక్షులు సద్ది సోమిరెడ్డి 50 కిలోల బియ్యం బుధవారం అందించారు. బూత్ కమిటీ అధ్యక్షులు కదునూరి పాండు, మహంకాళి శివకుమార్, ఎనుగుల రూప, జంగ మాధవి, యనమల్ల పర్శయ్య, పొట్టి మధు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భార్యపై గొడ్డలితో దాడి

రఘునాథపల్లి: మండలంలోని అశ్వరావుపల్లిలో భార్యపై గడ్డపారతో భర్త దాడి చేయగా తీవ్ర గాయాలపాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వల్లెపు సత్తయ్య–సారమ్మ మధ్య బుధవారం కుటుంబ తగాదా నెలకొంది. ఆవేశానికి గురైన సత్తయ్య క్షణికావేశంలో భార్య తలపై గడ్డపారతో దాడి చేశాడు. దీంతో సారమ్మకు తీవ్ర రక్తస్రావం కాగా కుటుంబ సభ్యులు వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించారు. కుమారుడు వల్లెపు రాజు ఫిర్యాదు మేరకు తండ్రి సత్తయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

జనగామ రూరల్: ద్విచక్ర వాహనం–కారును ఢీకొన్న ఘటనలో ఇద్దరికి త్రీవ గాయాలయ్యాయి. బుధవారం పట్టణంలోని నెహ్రూ పార్క్ బ్రిడ్జిపై చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం జనగామ మండలంలోని వడ్లకొండకు చెందిన దోరగోల్ల స్వామి, కర్నె ప్రభాకర్ జనగామ ఏరియా ఆస్పత్రి నుంచి జనగామ చౌరస్తాకు వెళ్తుండగా మరో బైక్‌ను ఓవర్ టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టారు. దీంతో బైక్‌పై ఉన్న వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విధులను అడ్డుకున్న వ్యక్తికి రిమాండ్

దేవరుప్పుల: గత నెల 26న తేదీన సీతారాంపురంలో పెళ్లి ఊరేగింపు వేడుకలో గొడవ జరుగుతున్న సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్ పెట్రో కార్ సిబ్బంది విధులకు ఆటకం కల్గించిన గుంటి అజయ్‌ను అరెస్టు చేసి కోరులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ చర్యలు చేపడుతున్నప్పుడు ఎవరూ ఆటకం కలిగించినా చట్టపరంగా కఠిన చర్యలు అనివార్యమని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో లేగదూడ మృతి

కొడకండ్ల: మండలంలోని రేగుల తండాకు చెందిన భూక్య బీచ్యాకు చెందిన లేగదూడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగిలి బుధవారం మృతి చెందింది. వ్యవసాయ అవసరాల నిమిత్తం నాలుగు రోజుల కిందట లేగదూడను రైతు కొనుగోలు చేయగా పొలంలో మేత మేస్తుండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన తీగలు ప్రమాదకరంగా ఉండటంతో తగిలి మృత్యువాత పడినట్లు రైతు తెలిపాడు. లేగదూడ మృతితో తీవ్రంగా నష్టపోయినందున నష్ట పరిహారం అందించి విద్యుత్ తీగలను సవరించి మరో ఘటన చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని రైతు కోరాడు.

వేడుకలు వైభవంగా నిర్వహిద్దాం!



కొడకండ్ల: కుంటను పరిశీలించిన అధికారులు



బచ్చన్నపేట: ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ



చిల్పూరు: ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కొడకండ్ల: చెరువుల పండుగ వేడుకలను వైభవంగా నిర్వహించుకుందామని, కార్యక్రమ విజయవంతానికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని తహసీల్దార్ చంద్రమోహన్, ఎంపీడీఓ సురేందర్‌నాయక్ కోరారు. మండలంలోని నర్సింగాపురం చౌటకుంటను బుధవారం వారు పరిశీలించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగ, మైసమ్మతల్లి ఉత్సవాలను ఇక్కడ నిర్వహించేందుకు ఏర్పాట్లపై వారు సూచనలు చేశారు. గ్రామ ప్రత్యేక అధికారి కుమారస్వామి, సీసీ సోమయ్య, ఉపసర్పంచ్ శ్రీనివాస్, కార్యదర్శి సందీప్, ఎఫ్ఏ పనస సమ్మయ్య పాల్గొన్నారు.

ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

బచ్చన్నపేట: చెరువు కట్టల వద్ద నిర్వహించనున్న చెరువుల పండుగకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి చెరువుల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా కేవలం 10 గ్రామాల్లో మాత్రమే చెరువుల పండుగను నిర్వహించాలని తెలిపామన్నారు. నీళ్ల సమృద్ధిగా ఉన్న చెరువులను ఎంపిక చేశామని అక్కడ మైసమ్మకు బోనాలు చేసి చెల్లించాలన్నారు. అలాగే నీటికి జల పూజ నిర్వహించాలన్నారు. గ్రామస్తులు అందరూ అక్కడే సామూహిక భోజనాలను చేయాలని తెలిపారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు ఉన్నారు.

ముస్తాబైన చెరువు కట్టమైసమ్మ గుడులు

దేవరుప్పుల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు ఊరూరా చెరువు కట్టలపై సంబురాలు జరిపేందుకు కట్టమైసమ్మ తదితర గ్రామ దేవతలు గుడులను ముస్తాబు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ బస్వ సావిత్రి, జెడ్పీటీసీ పల్ల భార్గవి, వైస్‌ఎంపిపి కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ పునర్నిర్మాణంలోనే సాగునీటి కల్పన దిశలో కాకతీయ చెరువుల పునరుద్ధరణతో భూగర్భ జలాలు పెరిగి కరవుకు ప్రతీకైన మన ప్రాంతం వ్యవసాయరంగంతోపాటు చేపలపెంపకం ఘనీయంగా పెరిగి ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు.

తెప్పల పోటీలకు కడియం శ్రీహరికి ఆహ్వానం

చిల్పూరు: మండలంలోని రాజవరం సమీపాన దేవాదుల రిజర్వాయర్‌లో గురువారం నిర్వహించే తెప్పల పోటీలకు హాజరు కావాలని బీఆర్‌ఎస్ నాయకుడు మారేపల్లి శ్యాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్సీ కడియం శ్రీహరిని కలిసి నాయకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువుల పండుగలో భాగంగా నిర్వహించే తెప్పల పోటీలకు ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండా ప్రకాష్, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డిలను ఆహ్వానించినట్లు తెలిపారు. నాయిని వెంకటనర్సు, కనుక రాజు, సమ్మయ్య, ఈర్ల రాజు, యాకూబ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

సాగునీటి రంగంలో అభివృద్ధి



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం సాగునీటి రంగంలో విశేషంగా అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో స్థానిక మాగార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం సాగునీటి దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం మరో కోనసీమను తలపిస్తుందని, 1.37లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని చెప్పారు.

కాంగ్రెస్ నేతగా పిండాలు పెట్టాను..

దేవాదుల పనుల కోసం 2003లో టీడీపీ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు, అప్పటి మంత్రి కడియం శ్రీహరి ఆఘమేఘాల మీద హెలికాప్టర్‌లో వెళ్లి శంకుస్థాపన చేశారని, అయితే 15 నెలలైనా తట్టమట్టి తీయలేదన్నారు. దాంతో అప్పుడు నియోజకవర్గంలో ప్రతిపక్ష కాంగ్రెస్ నేతగా తాను దేవాదుల వద్ద పిండాలు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరంలో 2004లో మహానేత డాక్టర్ వైఎస్సార్ సీఎం అయ్యాక.. దేవాదుల విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లానని, అయినా పనుల్లో జాప్యం జరిగిందన్నారు. తర్వాత ఉద్యమనేత కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రాజెక్టు పనులను రీడిజైన్ చేసి త్వరితగతిన చేపట్టారని వివరించారు. ఇరిగేషన్ ఈఈ ఎం.వినయ్‌బాబు, ఆర్‌డీఓ కృష్ణవేణి, డీఈలు శేషగిరి, సంపత్‌కుమార్, రామకృష్ణ, శ్యామ్, తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్, జెడ్పీటీసీ రవి, ఎంపీపీ రేఖ, ఇరిగేషన్ ఏఈ ఎండీ.యాసర్, సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, ఎంపీటీసీలు నర్సింహులు, దయాకర్ పాల్గొన్నారు.

ప్రగతి నివేదన యాత్రలో..

లింగాలఘణపురం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ అనంతరం గ్రామాల రూపురేఖలే మారడంతో పాటు ప్రజల జీవన ప్రమాణం మెరుగుపడిందని ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రగతి నివేదన యాత్రలో భాగంగా మండలంలోని పటేల్‌గూడెం, నవాబుపేట, వడిచర్ల, కొత్తపల్లి, వనపర్తి, నేలపోగుల, చీటూరు, కిష్టగూడెం, కుందారం గ్రామాల్లో పర్యటించి మాట్లాడారు. సర్పంచ్‌లతో పాటు ఎంపీపీ జయశ్రీ, జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసు, తహసీల్దార్ అంజయ్య, ఎంపీడీఓ మల్లికార్జున్, అధికారులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తాం..



చీరలు అందుకున్న మహిళలతో ఉషాదయాకర్‌రావు

దేవరుప్పుల: తెలంగాణ ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం పాటుపడే క్రమంలో తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో డీఆర్‌డీఏ, సెర్ప్ సంయుక్త ఆధ్వర్యంలో కుట్టుశిక్షణ పూర్తి చేసుకున్న 402 మంది మహిళలతోపాటు తోడ్పాటు అందించిన ఐకేపీ వీఓఏలకు ట్రస్టు తరఫున చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషమ్, జెడ్పీటీసీ పల్ల భార్గవి సుందర్‌రామిరెడ్డి, సర్పంచ్‌లు ఈదునూరి రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, సునీత బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయాకర్, కుట్టు శిక్షణ ప్రోగ్రామ్ అధికారి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ట్రస్టు కో ఆర్డినేటర్ కల్పన, ఐకెపి ఎపీఎం వెంకట్‌రెడ్డి, సీసీలు వసంత, ఉమ, చందన మండల సమాఖ్య అధ్యక్షురాలు నల్ల ఉమ, ఆయా గ్రామాల వీఓఎలు, మహిళ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం



హోమంలో పాల్గొన్న గ్రామస్తులు

చిల్పూరు: మండలంలోని లింగంపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం హోమంతో ప్రారంభమయ్యాయి. సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రధాన అర్చకులు చౌదరిమఠం సంతోష్‌శాస్త్రి ఆధ్వర్యంలో అర్చకుల వేద మంత్రాల నడుమ హోమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాల ఊరేగింపు చేపట్టారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీ చైర్మన్ గంగుల సంపత్‌రెడ్డి, సర్పంచ్ ఏదునూరి రవీందర్, ఎంపీటీసీ కంకటివ రవీందర్, ఉప సర్పంచ్ కంకటి రాజన్న, అర్చకులు చంద్రశేఖర్‌శాస్త్రి, ఆదిత్యశాస్త్రి, నవీన్‌శర్మ, విజయ్, విఘ్నేష్, శివప్రసాద్, మోతె శ్రీనివాస్, సందోజు రవీంద్రచారి, ఎలికాల తిరుపతి, రచ్చ రవీందర్, రజనీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేషనల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

దేవరుప్పుల: ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న నేషనల్ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల అర్జీదారులు రాజీపడే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 9వ తేదీలోపు యాక్సిడెంట్, కొట్టుకున్న ,చీటింగ్, చిట్ ఫండ్, భూతగాదాలు, వివాహ బంధానికి సంబంధించి, చిన్నచిన్న దొంగతనం కేసులు, అక్రమ రవాణా తదితర కేసులు ఉన్న ఇరువర్గాలు వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదిస్తే చట్టపరంగా సహకరిస్తామన్నారు. దీనికోసం ఫిర్యాదుదారుడు, నేరస్తుడు ఆధార్ కార్డులను తీసుకొని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలకుర్తిలో తిరుగులేని శక్తిగా బీజేపీ



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

కొడకండ్ల: పాలకుర్తి నియోజకవర్గంలో బీజేపీ తిరుగులేని శక్తిగా రూపుదిద్దుకొంటుందని ఆ పార్టీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పూసాల శ్రీమాన్ అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గ మహాజన్ సంపర్క్ అభియాన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అధికారమే లక్ష్యంగా కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని, దేశహితమే లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో యువత బీజేపీ వైపు చూస్తున్నారని, తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయశక్తిగా బీజేపీ ఎదిగిందన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు పెదగాని సోమయ్య, లేగ రామ్మోహన్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, జిల్లా, మండల నాయకులు శ్రీనివాస్, మహేందర్, కోటేశ్వర్‌రావు, సోమన్న, కుమార్, అఫ్జల్, నరేందర్, సృజన్, ఉపేందర్, శ్రీకాంత్, కుమార్, సురేష్, రవి, రాజ్‌కుమార్, శ్రవణ్, రామారావు, రాజేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పుస్తెమట్టెలు అందజేత

పాలకుర్తి టౌన్: మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిని నిరుపేద కుటుంబానికి చెందిన తొల్పునూరి లక్ష్మయ్య, నర్సమ్మ దంపతుల కూతురు స్వర్ణలత వివాహానికి బుధవారం దేవరుప్పల మండలం పెద్దమడూరు గ్రామానికి చెందని సామాజిక యువ నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ పుస్తెమట్టెలు అందజేశారు. తీగారం ఎంపీటీసీ బెల్లి సోమయ్య, కొమురయ్య, ఉప సర్పంచ్ కుమార్, పర్శరాములు, గోపినాథ్, నరేష్ ఉన్నారు.

పెళ్లి కానుక..

రఘునాథపల్లి: మహిళా సాధికారత–సామాజిక అభివృద్ధిలో భాగంగా మండల కేంద్రానికి చెందిన క్రాంతి గ్రామైఖ్య సంఘం బుధవారం స్పందన గ్రూపు మహిళా సంఘం సభ్యురాలి కూతురు వివాహనికి రూ.5,016 పెళ్లి కానుక అందజేశారు. రఘునాథపల్లికి చెందిన మరికూకల జానకి–అయోధ్య కూతురు వివాహానికి గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు మినుముల లక్ష్మి, కార్యదర్శి రంగు శ్రీవాని, కోశాధికారి కందుల శిరీష్, వీఓఏ మండల అధ్యక్షురాలు మినుముల పద్మలు హాజరై పెళ్లి కానుక అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎం సారయ్య మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యుల ఆడబిడ్డల వివాహానికి పెళ్లి కానుక కార్యక్రమం జిల్లాలో ప్రప్రథమంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. డీపీఎం వరలక్ష్మి, సీసీలు ఎల్లస్వామి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్..

జనగామ రూరల్: బేజాడి ట్రస్టు ఫౌండర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప ఆధ్వర్యంలో ఎర్రగోల్లపహాడ్‌లో యువతకు క్రికెట్ కిట్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బూత్ అధ్యక్షుడు వెంకటేష్, యువజన మోర్చా అధ్యక్షుడు మహిపాల్, రాంకోటి, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సెక్యూరిటీ గార్డులు

స్టేషన్‌ఘన్‌పూర్: జీఓ 21 ప్రకారం వ్యవసాయ మార్కెట్లలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటికొండ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డివిజన్ కేంద్రంలో ఘన్‌పూర్ మార్కెట్ కార్యదర్శి జీవన్‌కుమార్‌కు స్థానిక మార్కెట్ సెక్యూరిటీ గార్డులు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేస్తూ వేతనాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐలు నేరుగా మార్కెట్ కమిటీ నుంచి చెల్లించాలన్నారు. దాదాపు 25 సంవత్సరాలుగా మార్కెట్ యార్డులో రైతులకు సేవ చేస్తున్నామని, ఉద్యోగ భద్రత లేకుండా, కనీస వేతనాలు లేక శ్రమదోపిడికి గురవుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మార్కెట్ సెక్యూరిటీ గార్డుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు షేక్ షరీఫ్, గుండె రాంచందర్, గట్టు కిషన్, బూర వెంకటేష్ పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మెరుగైన విద్య



బడిబాటలో సర్పంచ్, ఎంఈఓ, ఉపాధ్యాయులు

పాలకుర్తి టౌన్: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య లభిస్తుందని మండల విద్యాశాఖ అధికారి ఎస్.యాకయ్య అన్నారు. బుధవారం మండలంలోని ముత్తారంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని సర్పంచ్ కల్వల భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఎంఈఓ యాకయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెడుతూ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు మన ఊరు–మన బడి కార్యక్రమాన్ని చెపట్టిందన్నారు. పాఠశాల హెచ్‌ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయులు రజిత, కుమారస్వామ, పీఈటీ చిట్యాల యాదగిరి, ఎస్ఎంసీ చైర్మన్ బడికే సోమన్న, మహేందర్‌రెడ్డి, కోనూరు మధు, కృష్ణమూర్తి, సత్తయ్యగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



మాట్లాడుతున్న నవీన్

పాలకుర్తి: సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ అన్నారు. బుధవారం మండలంలోని తీగారంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నవీన్ పాల్గొని మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. గ్రామ సర్పంచ్ పోగు రాజేశ్వరి సోమయ్య, బిఆర్ఎస్ నాయకుడు కమ్మగాని నాగన్న, వీరమనేని పాపరావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు స్వతంత్రంగా నిర్వహించాలి

జనగామ రూరల్: తెలంగాణ దశాబ్ది వేడుకలను దివ్యాంగుల శాఖ చేత స్వతంత్రంగా నిర్వహించాలని తెలంగాణ దివ్యాంగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పంతుల ప్రభాకర్ మంత్రి కొప్పుల ఈశ్వర్, చైర్మన్ వాసుదేవరెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా శిశు సంక్షేమ నుంచి దివ్యాంగుల శాఖ వేరైనందున ఈనెల 9న నిర్వహించే కార్యక్రమాలు ప్రత్యేకంగా చేపట్టి సముచిత గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, పట్టణ అధ్యక్షుడు ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బొడ్రాయి, దుర్గామాత ఉత్సవాలు



దుర్గామాతకు మొక్కుతున్న మహిళలు

రఘునాథపల్లి: మండలంలోని రామరాయనిబంగ్లాలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన బొడ్రాయి, దుర్గామాత ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. మంగళవారం రాత్రి దుర్గామాతకు గ్రామస్తులు ఊరుమ్మడిగా డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా బయలుదేరారు. గ్రామంలోని బొడ్రాయి వద్దకు బోనాలతో చేరుకొని అక్కడి నుంచి శివసత్తుల పూనకాలతో దుర్గామాత ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించారు. బుధవారం ఉదయాన్నే డుబ్బులోళ్ల ఆలయం వద్ద గావు పట్టడంతో గ్రామస్తులు కోళ్లు, యాటలు బలిచ్చారు. మధ్యాహ్నం దుర్గామాతకు మహిళలు భక్తిశ్రద్ధలతో ఒడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన భక్తులు దుర్గామాతను దర్శించుకున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



సంతాపం తెలుపుతున్న సతీష్‌రెడ్డి తదితరులు

బచ్చన్నపేట: మండలంలోని బసిరెడ్డిపల్లి సర్పంచ్ బాలగోని పర్శరాములు గౌడ్(40) అనారోగ్యంతో మృతి చెందగా పలువురు నాయకులు పరామర్శించారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో పర్శరాములు గౌడ్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. బసిరెడ్డిపల్లి నూతన జీపీగా ఏర్పడిన తర్వాత తొలి సర్పంచ్ పర్శరాములుగౌడ్. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. బాధిత కుటుంబీకులను సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి, కోనేటి స్వామి, నాయకులు మేకల రాజు, శశిధర్ రెడ్డి, వినయ్‌కుమార్, భాస్కర్, మహిపాల్‌రెడ్డి పరామర్శించారు. అలాగే బచ్చన్నపేట ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

అంగన్‌వాడీల్లో అన్ని వసతులు



బచ్చన్నపేట: గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించడం జరుగుతుందని కొడవటూర్–1 అంగన్‌వాడీ టీచర్ ప్రేమలక్ష్మి అన్నారు. బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తామని అన్నారు. . బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.

క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ థామస్‌కిరణ్

స్టేషన్‌ఘన్‌పూర్: క్రీడల ద్వారా క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ థామస్ కిరణ్ అన్నారు. జనగామ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల మైదానంలో మహేష్ ఫుట్‌బాల్ అకాడమీ పీడీ ఎస్.మహేష్ పర్యవేక్షణలో గత నెలరోజుగా నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ సమ్మర్ కోచింగ్‌క్యాంపు ముగిసింది. ఈ మేరకు ముగింపు కార్యక్రమాన్ని కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కాగా, స్టేట్ లెవల్ సీఎం కప్ టోర్నమెంట్‌లో పాల్గొన్న క్రీడాకారులు అనీల్‌కుమార్, తరుణ్‌కుమార్, జోయల్‌ఇవాన్, కృష్ణప్రణయ్, నితేజ్, పహానికుమార్, పవన్‌లకు ప్రిన్సిపాల్ అభినందించారు. పీడీ సింగపురం మహేష్, పీఈటీ తాటికొండ రమేష్, తేజ, అఖిల్, చైతన్య , సాయి, హర్ష, కార్తీక్, అద్విన్, వరుణ, అర్జున్, సంజయ్, ఆర్యన్ తదితర క్రీడాకారులు పాల్గొన్నారు.

నియామకం



దామోదర్

చిల్పూరు: జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్‌గా చిల్పూరు మండలం చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన గజ్జెల దామోదర్‌ను నియమించినట్లు జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున్, రాష్ట్ర అధ్యక్షుడు మాడా రాజాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలు తెలుసుకొని జాతీయ, రాష్ట్ర అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

సీపీఎం కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ



జనగామ రూరల్: మండలంలోని ఎర్రగోల్లపహడ్‌లో సీపీఎం కార్యాలయ నిర్మాణానికి బుధవారం మండల కార్యదర్శి నరేందర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి వాటిని తుంగలో తొక్కిందని అన్నారు. గ్రామ శాఖ కార్యదర్శి రాజు, సర్పంచ్ వంగాల రేణుక, చంద్రం, మల్లేషం, సిద్దులు, కనకయ్య, వెంకటయ్య, కనకచారి పాల్గొన్నారు.